

ఎంసీహెచ్ కిట్.. కట్..

గతంలో గర్భిణులు, బాలింతలకు ఇచ్చిన కిట్ల పేర్లను మార్చిన ప్రస్తుత ప్రభుత్వం.. వాటి సరఫరాను మాత్రం మరిచింది. 10లో



మామిడి రైతు విలవిల

ఇటీవలి అకాల వర్షాలు, గాలిదుమారంతో చేతికందే దశలో మామిడికాయలు నేలరాలగా.. రైతులు విల్లవిల్లాడుతున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో గురువారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జీలు



జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సరిత

కొత్తగూడెంటౌన్: జిల్లా మొదటి అదనపు జడ్జిగా ఎస్.సరిత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ ఫ్యామిలీ కోర్టులో విధులు నిర్వహిస్తున్న సరిత కొత్తగూడెం కోర్టుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా, ఆమె జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఇక సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి మీరా ఖాసీం నుంచి కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరిద్దరూ జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సరిత, కిరణ్‌కుమార్‌కు రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మోహన్‌దాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గృహ నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వేణుగోపాల్ తదితరులు

మణుగూరురూరల్/పినపాక : ఇందిరమ్మ గృహ నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. మణుగూరు మండలంలో నిర్మిస్తున్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యంగా చేపట్టాలే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సాంబాయిగూడెం, పినపాక మండలం పోట్లపల్లిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా.. వారికి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీలను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్‌ఓ పి.రుక్మిణి దేవి, సివిల్ సప్లయీస్ డీఎం త్రినాథ్ బాబు, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, సివిల్ సప్లయీస్ డీటీ శివకుమార్ ఉన్నారు.

ప్లాంటేషన్‌ను పరిశీలించిన విజిలెన్స్ డీఎఫ్‌ఓ



ఇరవెండిలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బూర్గంపాడు: ఇరవెండి, సారపాక అటవీ బీట్లలోని ప్లాంటేషన్లను విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుందరెడ్డి బుధవారం పరిశీలించారు. మొక్కల ఎదుగుదల, అటవీ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అటవీ శాఖ అధికారులకు సూచించారు. వనసంరక్షణతో పాటు వన్యప్రాణి సంరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో అశ్వాపురం ఎఫ్ఆర్‌ఓ రమేష్, సారపాక డీఆర్‌ఓ సుజాత, ఎఫ్‌బీఓ భీమ్‌చందర్ నాయక్ పాల్గొన్నారు.

ఆమోద ముద్ర పడేనా?



నిలిచిపోయిన సీతమ్మ సాగర్ బరాజ్ పనులు (ఫైల్)

కేంద్ర జలశక్తి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో గురువారం జరగనున్న 158వ సమావేశంలో సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం చర్చకు రానుంది. తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు రాలేదు. నేడు జరిగే సమావేశంలో సీతారామ డీపీఆర్‌ను టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) పరిశీలించనుంది. ఈ డీపీఆర్‌కు టీఏసీ ఆమోద ముద్ర లభిస్తే సీతారామ ప్రాజెక్ట్‌కు ఉన్న ప్రధాన అడ్డంకులన్నీ దాదాపుగా తొలగిపోయినట్టే. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

'సీతారామ'పై నేడు ఢిల్లీలో టీఏసీ సమావేశం

- ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలించనున్న టెక్నికల్ కమిటీ
- గత ఫిబ్రవరిలోనే జారీ కావాల్సిన అనుమతులు
- ఇప్పటికైనా గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. బరాజ్ పనుల్లో పెరగనున్న వేగం

మేడిగడ్డ ప్రభావంతో..

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బరాజ్ (లక్ష్మీ బరాజ్) కుంగుబాటుతో కేంద్ర జల సంఘం , నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీలు కొత్త ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేసేప్పుడు ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి. గరిష్ట వరద ప్రవాహాలు, వాటి వేగం, బరాజ్ నిర్మించే ప్రదేశంలో నేల స్వభావం.. వీటికి అనుగుణంగా బరాజ్ డిజైన్లు ఉన్నాయా.. ఇలా ప్రతీ అంశాన్ని కమిటీ సభ్యులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. పైగా సీతమ్మసాగర్‌లో 282 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉండడంతో ఈ బరాజ్ డిజైన్లను మరింత వివరంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని గత సమావేశంలో టీఏసీ అభిప్రాయపడింది.

ఫిబ్రవరిలోనే రావాల్సింది..

సీతారామ సమగ్ర ప్రాజెక్టు నివేదికకు (డీపీఆర్) సంబంధించిన సాంకేతిక అనుమతుల ఫైల్ ఈ ఏడాది ఫిబ్రవరి 11న సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ముందుకు వచ్చింది. కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నాడు జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయభాస్కరరెడ్డి, కొత్తగూడెం సీఈ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అశ్వాపురం మండలంలో గోదావరిపై సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మించడంతో 67 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తూ ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే ప్రణాళికను వారు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇతర అనుమతులు ఇప్పటికే లభించాయని, కీలకమైన టీఏసీ అనుమతి వస్తే బరాజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోతాయని కమిటీ సభ్యుల దృష్టికి తెచ్చారు. అయితే సీతారామ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన సీతమ్మ సాగర్ బరాజ్ డిజైన్లను మరోసారి పరిశీలిస్తామని చెప్పడంతో అనుమతులకు ఆలస్యమైంది.

అనుమతుల సాధన తప్పనిసరి..

జీవ నదులపై ఏమైనా కొత్త ప్రాజెక్టులు నిర్మించాలంటే ముందుగా ఆ నదీ యాజమాన్య బోర్డు, ఆ తర్వాత కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి తప్పనిసరి. ఈ రెండు చోట్లా అనుమతులు వచ్చాక సీడబ్ల్యూసీ నియమించిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ పరిశీలనకు పంపాలి. ఈ కమిటీ డీపీఆర్‌ను పరిశీలించి ఆమోదం తెలిపితే ఆ ప్రాజెక్టుకు టెక్నో ఎకనామికల్ అప్రైజల్ వచ్చినట్టుగా భావిస్తారు. అనంతరం కేంద్ర జల్ శక్తి మంత్రి, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు సభ్యులుగా ఉన్న అపెక్స్ కమిటీ నుంచి తుది అనుమతులు రావాల్సి ఉంటుంది. వివాదాస్పద ప్రాజెక్టులను మినహాయిస్తే అపెక్స్ కమిటీ అనుమతి లాంఛనప్రాయమే.

ఆగుతూ.. సాగుతూ..

సీతారామ ఎత్తిపోతల పథకం పనులు 2016లో ప్రారంభమయ్యాయి. అనూహ్య కారణాలతో 2018లో డిజైన్లు మారాయి. దీంతో మరోసారి డీపీఆర్ సిద్ధం చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కరోనా కష్టాలు కమ్ముకున్నాయి. ఎట్టకేలకు తుది డీపీఆర్ రెడీ చేసి 2023 జనవరి 23న టెక్నో అప్రైజల్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. ఈ రిపోర్టును పరిశీలించిన కేంద్ర జల సంఘం.. సీతమ్మ సాగర్ బరాజ్‌లో జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అప్రైజల్‌ను తిరస్కరించింది. దీంతో విద్యుత్ కేంద్రం మినహా మిగిలిన బరాజ్ నిర్మాణ పనులు జరుగుతున్న తరుణంలో ఈ అంశం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లగా.. ఎక్కడి పనులు అక్కడే ఆపేయాలంటూ 2023 మేలో ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది.

భూ భారతితో రైతులకు మేలు



దుమ్ముగూడెం : సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి

దుమ్ముగూడెం/చర్ల : భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని, భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం దుమ్ముగూడెం మండలం గంగోలు, చర్ల మండల కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణిలో ఉన్న లోపాలను సరి చేస్తూ నూతన చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. రైతులు కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వారసత్వ హక్కులతో పాటు సాదాబైనామాను సులభంగా చేసుకోవచ్చన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణలు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వంటి సమస్యలకు ఈ చట్టం పరిష్కారం చూపుతుందని వివరించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఆర్డీఓ దామోదరరావు, ఏడీఈ సుధాకర్‌రావు, తహసీల్దార్లు అశోక్‌కుమార్, ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓలు నవీన్‌కుమార్, లావణ్య, ఏఎంసీ చైర్మన్లు ఇర్పా శ్రీను, తెల్లం సీతమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు కిలిమి ఎల్లారెడ్డి, పరుచూరి రవికుమార్, మండపాటి అచ్యుత శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి అధికారులు

మణుగూరు రూరల్ : కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను సింగరేణి మణుగూరు ఏరియా అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మణుగూరు మండలం అన్నారం గ్రామంలోని తిమ్మారెడ్డి కుంట చెరువు పూడికతీత పనులకు ప్రభుత్వంతో రూ.70 లక్షలకు ఎంఓయూ చేసుకున్నారు. మణుగూరు పరిసర గ్రామాల ప్రజలకు సింగరేణి యాజమాన్యం విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడం, చెరువులు, కుంటలు పూడికతీత, సాగు పనులకు సౌకర్యాలు కల్పించడం పట్ల కలెక్టర్ అభినందించారు.

నేడు మామిడి రైతుబజార్ ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో గురువారం నుంచి మామిడి రైతుబజార్ మొదలవుతుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. రైతులు, వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ రైతుబజార్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. సహజసిద్ధమైన పరిస్థితుల్లో పండించి, కార్బైడ్ రహితంగా మాగబెట్టిన మామిడి పండ్లనే మాత్రమే ఇక్కడ విక్రయిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధుసూదన్ సూచించారు.

దిశ సమావేశం వాయిదా

చుంచుపల్లి : స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించాల్సిన దిశ సమావేశం వాయిదా పడిందని కలెక్టర జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి హాజరవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రాథమిక విద్యలో ఏఐ ప్రాముఖ్యత పెంచాలి

డీఈఓ వెంకటేశ్వరా చారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

బూర్గంపాడు: ప్రాథమిక విద్యలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రాముఖ్యత పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరా చారి అన్నారు. అంజనాపురం ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఏఐ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంజనాపురం పాఠశాల అభివృద్ధిలో జిల్లాలోనే ముందుందని తెలిపారు. పాఠశాల వాతావరణం, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఏఐలో కూడా అంజనాపురం పాఠశాల జిల్లాలో అగ్రస్థానం సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, నోట్ పుస్తకాలు అందించారు. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కిషన్‌రావు, ఉపాధ్యాయులు బాబూరావు, శంకర్, సునీత, పద్మ పాల్గొన్నారు.

చంద్రుగొండకు రైలొచ్చింది !



చంద్రుగొండ స్టేషన్‌లో నిలిపిన రైలు

చంద్రుగొండ రైల్వేస్టేషన్‌కు బుధవారం ప్యాసింజర్ రైలొచ్చింది. దీంతో మండల వాసులంతా అధికారులు రైలు సౌకర్యం కల్పించారు.. మన కల సాకారం అయిందని ఆశించారు. కానీ వారి అంచనా తప్పయింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాకు రేల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడిపింది. ఆ కార్యం ముగియడంతో ఖాళీగా ఉన్న ఏడు బోగీలతో పాటు ఇంజన్‌ను చంద్రుగొండ రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చి లూప్‌లైన్‌లో నిలిపారు. – చంద్రుగొండ

కాంగ్రెస్ జిల్లా పరిశీలకుల నియామకం

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ జిల్లా పరిశీలకులుగా పి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి,పి.ప్రమోద్‌కుమార్‌లను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకూ పరిశీలకుల నియామకాలు జరిగాయి.

తాగునీటికి ఢోకా లేనట్టే..

సమ్మక్క బరాజ్ నుంచి దుమ్ముగూడెం ఆనకట్టకు నీరు



దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ప్రస్తుత నీటిమట్టం ఇలా..

అశ్వాపురం : కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆనకట్ట వద్ద ఇటీవల నీరు తగ్గగా ఏప్రిల్, మే నెలల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో సమ్మక్క–సారక్క బరాజ్ నుంచి ఈనెల 14న 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీరు బుధవారం ఆనకట్ట వద్దకు చేరింది. దీంతో నీటిమట్టం 47.7 మీటర్లకు చేరింది. నిరంతరాయంగా నీరు విడుదలై నీటిమట్టం 49.6 మీటర్లకు పెరిగితే ఈ వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు.

'నవమి' లెక్క తేలేదెప్పుడో ?

- ఆదాయానికి మించి ఖర్చులతో రామయ్యపై భారం
- ఈ ఏడాదీ అందని ప్రభుత్వ ఫెస్టివల్ ఫండ్



శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా ముగిశాయి. ఇక రామయ్య ఆదాయ, వ్యయాల లెక్కలు తేలాల్సి ఉంది. నవమి అనంతరం పనులు, వరుస సెలవులు రావడంతో లెక్కల వివరాలను తెలపడంలో జాప్యం జరుగుతోందని ఆలయ అధికారులు అంటున్నారు. అయితే ఈ ఏడాది సైతం ఆదాయ, వ్యయాలు సమానంగా ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తొలిసారిగా హాజరైన ఈ ఉత్సవానికి ప్రభుత్వ సాయం ప్రకటనపై అందరూ ఆసక్తిగా ఎదురుచూసినా.. ఉత్సవాల నిర్వహణ ఫండ్‌పై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో భక్తులు, ఆలయ సిబ్బంది నిరాశకు లోనయ్యారు.

టికెట్ల విక్రయమే ప్రధాన వనరు..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణకు దేవస్థానానికి రూ.2.50 కోట్లు ఖర్చవుతాయని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఇక శ్రీరామనవమికి విక్రయించే టికెట్ల ద్వారా వచ్చే ఆదాయమే ఆలయానికి ప్రధాన వనరుగా మారుతోంది. ఈ టికెట్లను ఆన్‌లైన్, కౌంటర్ల ద్వారా విక్రయించారు. ఆన్‌లైన్‌లో ఈ ఏడాది ముందుగానే టికెట్లు అందుబాటులో ఉంచారు. అయితే సీఎంతో పాటు వీవీఐపీలు కల్యాణానికి పెద్ద ఎత్తున తరలిరావడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఉభయ దాతల సెక్టార్‌ను కుదించారు. 1000 టికెట్లను 725కే పరిమితం చేయడంతో సుమారు రూ.16 లక్షల ఆదాయానికి గండి పడింది. దీనికి తోడు రెవెన్యూ అధికారులు విక్రయించిన టికెట్ల ఆదాయం సైతం తగ్గే అవకాశం ఉంది. ఇలా ఆన్‌లైన్, కౌంటర్ల ద్వారా విక్రయించిన టికెట్లతో పాటు పరోక్ష సేవల ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం కలిపి సుమారు రూ.2.75 కోట్ల మేర సమకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఆలయ హుండీ ఆదాయం సైతం లెక్కించాల్సి ఉంది. గత లెక్కల ప్రకారం 45 రోజులకు సుమారు రూ.కోటి ఆదాయం వచ్చింది. శ్రీరామ నవమి అనంతరం వరుస సెలవులు ఉండటంతో భక్తుల రద్దీ కూడా బాగానే ఉంది. దీంతో నెల రోజులకు హుండీ ఆదాయం రూ.కోటి వరకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ ఏడాది రెండు లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. ఇలా మొత్తంగా శ్రీరామనవమి ఉత్సవాల ద్వారా రూ.3.50 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఫెస్టివల్ ఫండ్ ప్రకటిస్తే బాగు..

ఏటా శ్రీరామనవమి వేడుకలను ప్రభుత్వ ఉత్సవాలుగా ప్రకటించి ఫెస్టివల్ ఫండ్ విడుదల చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ప్రత్యేక నిధులతో ఉత్సవాలను విజయవంతం చేస్తే దేవస్థానానికి రూ.2.50 కోట్ల వరకు ఆదా అవుతుంది. దీనికి తోడు నవమి ఆదాయం అదనంగా మారనుంది. అంటే సుమారు రూ. కోట్ల మేర నిధులు రామయ్య చెంతన ఉంటాయి. దీంతో భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు, ఇతర సేవలు శాశ్వతంగా అందించే అవకాశం ఉంటుంది. ఇంకా నిత్యాన్నదానాన్ని ప్రతిరోజూ అసంఖ్యాకంగా అందజేయాలనే సంకల్పం సైతం నెరవేరుతుంది. 2027లో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. భద్రాచలంలో ఉన్న పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ నేపథ్యంలో గోదావరి పుష్కరాలకు ముందు జరిగే 2026 నవమి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని ఫెస్టివల్ ఫండ్ విడుదల చేసి శాశ్వత వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

వేసవి సెలవులు వచ్చేశాయ్..

హాస్టళ్ల నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థులు





పాల్వంచరూరల్ : ఆటోలో సామగ్రి సర్దుతున్న దృశ్యం (ఇన్‌సెట్) ములకలపల్లి : తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో బుధవారం పాఠశాలల్లో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డులను ఇచ్చారు. వేసవి సెలవులు ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు కొనసాగనున్నాయి. కాగా, సెలవులు రావడంతో హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ట్రంకుపెట్టెలు, లగేజీ బ్యాగులు సర్దుకుని ఇంటిబాట పట్టారు. పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రావడం, ఆయా ప్రాంతాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలతో సందడి నెలకొంది. విద్యార్థులు పరస్పరం వీడ్కోలు చెప్పుకుంటూ ఇళ్లకు బయలుదేరారు.
– కొత్తగూడెంఅర్బన్/పాల్వంచరూరల్/ములకలపల్లి

క్లుప్తంగా

ఎమ్మెల్యే కాన్వాయ్ ఎదుట రైతుల నిరసన


ఆందోళన చేస్తున్న రైతులు

చంద్రుగొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాన్వాయ్‌ని మొక్కజొన్న రైతులు అడ్డుకున్నారు. బుధవారం ఆయన మండల పర్యటనకు రాగా, తమకు న్యాయం చేయాలంటూ పోలకగూడెం గ్రామ రైతులు అడ్డగించారు. తమ గ్రామంలో 20 మంది రైతులు ఓ ప్రైవేట్ కంపనీ వద్ద మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశామని, అవి నకిలీవి కావడంతో పంట దిగుబడి రాలేదని అన్నారు. ఈ మేరకు గత ఫిబ్రవరిలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకూ కంపెనీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాగా, బాధితులకు ఎలాంటి హామీ ఇవ్వకుండానే పోలీసులు వారిని పక్కకు నెట్టివేసి ఎమ్మెల్యే కాన్వాయ్‌ని పంపించారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చిన సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీ పరిధి సంజయ్‌నగర్‌లో సింగరేణి పంప్‌హౌస్ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న గదిని సింగరేణి ఎస్టేట్స్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బందితో బుధవారం కూల్చివేయించారు. అక్రమ నిర్మాణంపై స్థానికులు సింగరేణి అధికారులకు సమాచారం అందించగా ఈ మేరకు చర్యలు చేపట్టారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శేఖర్‌రావు తదితరులు

టేకులపల్లి: జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫాల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గోదాముల్లో బియ్యం తూకం వేసి లోడ్ వేయాలని, షాపులో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని గోడౌన్లకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రామా, కోశాధికారి బి.బాలు, ప్రచార కార్యదర్శి వి. వెంకటేష్, టేకులపల్లి మండల అధ్యక్షుడు ఎ.సంతులాల్ పాల్గొన్నారు.

ఘనంగా పీటీఎం సమావేశాలు


పాతతండా పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: పాఠశాలలకు నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో చివరి రోజైన బుధవారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పీటీఎంలు ఏర్పాటు చేయగా తల్లిదండ్రుల సలహాలు, సూచనలు నమోదు చేసుకున్నారు. రెగ్యులర్‌గా పాఠశాలకు వస్తున్న, చదువులో రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల రైటింగ్ స్కిల్స్ మెరుగు పర్చేందుకు కలెక్టర్ తరఫున అందించిన తెలుగు, ఇంగ్లిష్ కాపీ రైట్ నోట్ పుస్తకాలను 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అందజేశారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

నేలకొండపల్లి: ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మండలంలోని శంకరగిరితండాకు చెందిన వ్యవసాయ కూలీలు ముదిగొండ మండలం మాధాపురంలో మిర్చి తోట ఏరేందుకు కొద్దిరోజులుగా వెళ్తున్నారు. బుధవారం కూడా పని ముగిశాక వారు వస్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో మాధవి(25)కి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా చికిత్స చేయించి ఖమ్మం తరలించగా మృతి చెందింది.

చెరువులో వ్యక్తి గల్లంతు

తల్లాడ: మండలంలోని ముద్దునూరు చెరువులో బుధవారం పడి రిటైర్డ్ ఉద్యోగి గల్లంతయ్యాడు. సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయిన గ్రామవాసి కాకర్ల అప్పారావు(63) తన గేదె, దూడ మేత కోసం పొలంలో ఉండగా తీసుకొచ్చేందుకు వెళ్లాడు. సమీపంలోని చెరువులోకి గేదె, దూడ దిగి లోతులోకి వెళ్తుండగా అప్పారావు దూడను బయటకు తీసుకొచ్చే క్రమాన ఆయన ఊబిలో కూరుకుని గల్లంతయ్యాడు. ఈమేరకు గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

ఎంసీహెచ్ కిట్.. కట్..

పేరు మార్చారు.. సరఫరా మరిచారు..

- జిల్లాలో ఏడాదికి 15 నుంచి 20 వేల వరకు ప్రసవాలు
- ప్రారంభంలో వెయ్యి కిట్లు పంపిణీ..
- తర్వాత చేతులెత్తేసిన ప్రభుత్వం



ఇల్లెందు వైద్యశాలలో న్యూట్రీషియన్ కిట్ అందుకుంటున్న గర్భిణి (ఫైల్)

ఇల్లెందు: గర్భిణులు, బాలింతలకు అందించే పథకాల పేర్లను ప్రస్తుత ప్రభుత్వం మార్చింది. కానీ, ఆ కిట్లను సరఫరా చేయడం లేదు. నాటి ప్రభుత్వంలో కేసీఆర్ కిట్‌గా చెలామణిలో ఉన్న పథకానికి ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సరఫరా చేయడం మానేసింది. 10 నెలలుగా గర్భిణులు, బాలింతలకు అందజేసే ఏ కిట్టు కూడా అందటం లేదు. ఎంసీహెచ్ కిట్‌తో పాటు న్యూట్రీషియన్ కిట్, మగ శిశువు జన్మిస్తే రూ.12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే రూ.13 వేలు నగదు ప్రోత్సాహం కూడా అందటం లేదు. ప్రస్తుతం కిట్ల కోసం గర్భిణులు, బాలింతలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 2024–25 సంవత్సరానికి గాను సుమారు 13,500 వరకు ప్రసవాలు జరిగాయి. అందులో ఒక్కరికి కూడా కిట్ అందలేదు. జిల్లాలో 29 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, 376 సబ్ సెంటర్లు, 7 ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. ఒక్క ఇల్లెందు ఏరియా వైద్యశాలలోనే 1,949 ప్రసవాలు జరగగా 1,624 మందికి ఎంసీహెచ్ కిట్లు అందజేశారు. ఇంకా 324 మందికి అందలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి అందడంలేదు.

ప్రసవాల సంఖ్య పెరిగేదెలా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలనే లక్ష్యంతో ఈ పథకాలను ప్రవేశపెట్టారు. ఎంసీహెచ్ కిట్, న్యూట్రీషియన్ కిట్లతో పాటు నగదు ప్రోత్సాహం కూడా ప్రస్తుతం అందటం లేదు. ప్రభుత్వం నుంచి ఈ పథకాల పంపిణీ ఊసే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్‌ను తొలగించి గర్భిణుల కోసం మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) కిట్‌ను ప్రవేశపెట్టారు. ఏరియా వైద్యశాలల్లోనే ఏడాదికి 15 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చిన తర్వాత జిల్లాలో వెయ్యి కిట్లు మాత్రమే పంపిణీ చేశారు. ఆ తర్వాత సరఫరా ఆగిపోయింది. రూ.12 వేలు, రూ.13 వేల పారితోషికం కూడా రావడం లేదు. గర్భిణులకు 5వ నెల నుంచి 8వ నెల వరకు ఏడాదిలో రెండు సార్లు ఇచ్చే న్యూట్రీషియన్ కిట్‌లు కూడా ఇవ్వడం లేదు. మూడు దశల్లో రూ.12 వేలు అందజేయటం, అమ్మాయి అయితే మరో వెయ్యి అదనంగా అందించే నగదు ప్రోత్సాహానికీ చెక్ పడింది. తొలి విడత రూ.3 వేలు, రెండో విడత రూ.4 వేలు, తర్వాత రూ.5 వేలు అందిస్తే అవి పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. ఎంసీహెచ్ కిట్‌లో తల్లీ, బిడ్డకు కావాల్సిన దుస్తులు, సబ్బులు, నూనెలు, పౌడర్లు, ఈగలు, దోమలు వాలకుండా తెర, టవళ్లు లాంటి వస్తువులు ఉండేవి.

న్యూట్రీషియన్ కిట్ అందలేదు..



గర్భిణులకు ఇచ్చే న్యూట్రీషియన్ కిట్ అందలేదు. ప్రసూతి సమయంలో అందజేసే కిట్ కూడా ఇవ్వలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న వస్తువులను వాడుకున్నాం. గతంలో ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం అయితే అందజేసే కిట్‌ను ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే.. ప్రభుత్వం నుంచి రాలేదంటున్నారు. –స్రవంతి, బాలింత, లక్ష్మీపురం, ఆళ్లపల్లి

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు



ప్రభుత్వం నుంచి సరఫరా నిలిచిపోయింది. గతంలో కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్ ఉండగా ప్రస్తుతం ఎంసీహెచ్ కిట్‌గా మార్చారు. ఏటా ఏరియా ఆస్పత్రుల్లో 15 నుంచి 20 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. అందరికీ ఈ కిట్‌లు, నగదు ప్రోత్సాహం అందటం లేదు.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

తాటి ముంజలు.. భలే పసందు !


భద్రాచలంలో తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం


కొనుగోలు చేస్తున్న ప్రజలు

భానుడు భగ్గుమంటున్నాడు. దీంతో ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వారు దాహార్తితో అల్లాడిపోతున్నారు. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరని పరిస్థితి. దీంతో శరీరానికి చలువచేసే తాటి ముంజల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయం సమీపంలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. డజన్ రూ.50 నుంచి 70 చొప్పున విక్రయిస్తున్నారు.

– భద్రాచలంఅర్బన్

ఖమ్మం మార్కెట్‌లో డీడీఎం పరిశీలన


యార్డులో పరిశీలిస్తున్న డీడీఎం పద్మావతి, చైర్మన్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల కొనుగోళ్లను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి బుధవారం పరిశీలించారు. మిర్చి జెండా పాట, ధర ఖరారుపై రైతులతో మాట్లాడిన ఆమె సమస్యలపై ఆరా తీశారు. అలాగే, కాంటాల తీరును కూడా తనిఖీ చేశారు. అనంతరం మార్కెట్‌లో రూ.155.35 కోట్లతో చేపట్టిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతేకాక సీసీఐ పత్తి కొనుగోళ్లలో వచ్చిన ఆరోపణలపై అధికారులతో చర్చించినట్లు సమాచారం. తాత్కాలిక రిజిస్ట్రేషన్ల(టీఆర్)కు సంబంధించి ఎన్ని పుస్తకాలు ముద్రించారు, ఎవరెవరికి జారీ చేశారనే అంశాలు ఆరా తీసినట్లు తెలిసింది. మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–2 కార్యదర్శి సృజన్ బాబు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

జూన్ 6నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్,ఎక్స్,ఇంప్రూవ్‌మెంట్) జూన్ 6నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. పరీక్షలు ఈనెల 26 నుంచే నిర్వహించాల్సి ఉన్నా వాయిదా వేశారు. ఈమేరకు రీషెడ్యూల్ చేస్తూ టైంటేబుల్‌ను బుధవారం విడుదల చేశారు. జూన్ 6, 9, 11,13, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు జరుగుతాయని, వివరాలను కేయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

బ్రేకులు ఫెయిల్ కావడమే కారణం


ట్రాక్టర్ ఢీ కొట్టడంతో బోల్తా పడిన ఆటో

ఇల్లెందు : నిత్యం వందలాది మంది సంచరించే చోట ఓ ట్రాక్టర్ బ్రేకులు ఫెయిల్ అయి అక్కడే పార్కింగ్ చేసిన ఆటోను ఢీ కొట్టింది. ట్రాక్టర్ వేగానికి ఆటో పల్టీ కొట్టగా నుజ్జునుజ్జయింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇల్లెందులోని పాత బస్టాండ్ సమీపంలో పోలీస్‌స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో మెయిన్ రోడ్ వద్ద బ్యాంక్‌లో పని కోసం వచ్చిన వారు ఆటోను పక్కన అపారని, ఆ సమయంలో వచ్చిన ట్రాక్టర్ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఆటోను ఢీకొట్టాడని పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్ జి. భద్రు ఫిర్యాదు మేరకు ఇల్లెందు మండలం పోచారం తండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బానోతు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తల్లి మేకల కన్నమ్మ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మేకల నరేష్(35)కు 12 ఏళ్ల క్రితం శిరీషతో వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం క్రితం శిరీషతో అనంతారం గ్రామానికి చెందిన మంజుల ప్రసాద్ అనే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడడాన్ని నరేష్ గమనించాడు. ఈనెల 11న మల్లాయిగూడెం వద్ద గల పామాయిల్ తోటలో కూలీ పనులకు వెళ్లిన నరేష్.. అక్కడి నుంచే ప్రసాద్‌కు ఫోన్ చేసి తన భార్యతో ఎందుకు మాట్లాడుతున్నావని అడగగా.. అతడు దుర్భాషలాడాడు. కాసేపటి తర్వాత ప్రసాద్, అతడి మిత్రులు సనికొండ సాయి, మంజుల వెంకన్న పామాయిల్ తోట వద్దకు వచ్చి నరేష్‌పై దాడి చేశారు. ఇది అవమానంగా భావించిన నరేష్ గుమ్మడవల్లి శివారులోని పామాయిల్ తోటలో గడ్డి మందు తాగగా కుటుంబసభ్యులు తెలుసుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించగా, బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతిరాజు తెలిపారు.

ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడిపై దాడి

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్ : ఫంక్షన్ హాల్ నిర్వాహకుడిపై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని పెద్దమ్మ గుడి వద్ద గల భవానీ ఫంక్షన్‌హాల్‌ను కొత్తగూడేనికి చెందిన వారు బుధవారం అద్దెకు తీసుకున్నారు. ఫంక్షన్ పూర్తయ్యాక హాల్ నిర్వాహకుడు చింతలూరి శ్రీనివాసరావు కిరాయి రూ.1,500 అడగడంతో అద్దెకు తీసుకున్న విజయ్, మల్లెల శంకర్, కంది కృష్ణ అతడితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు కూలీలు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన 10 మంది కూలీలు బుధవారం ఆటోలో వినాయకపురం సమీపంలోని అరటి తోటలో కూలీ పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వినాయకపురం సెంటర్‌లో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆటో బోల్తా పడగా, కూలీలు భూక్యా సక్రు, బోడపాటి చిలకమ్మ, నార్లపాటి మరియమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువులను టేకులపల్లి పోలీసులు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తతండా వద్ద బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎస్28 టీ 9696 నంబర్ ట్రాలీలో పశువులను తరలిస్తుండగా పట్టుకున్నారు. మూడు ఎద్దులు, ఒక ఆవును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న సుజాతనగర్ మండలం సర్వారం పంచాయతీ ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన భూక్యా ఈర్య, కోయగూడెం గ్రామానికి చెందిన బానోత్ బిక్కులాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గాడిచర్ల ఏసుబాబు స్థానికంగా ఓ యువతి(21)ని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని కొద్ది నెలలుగా వెంటపడి వేధిస్తున్నాడు.కాగా, యువతికి కుటుంబసభ్యులు పెళ్లిసంబంధాలు చూస్తుండగా.. తనను పెళ్లి చేసుకోకుంటే అంతు చూస్తానని బెదిరించసాగాడు. ఈ మేరకు బాధితురాలిఫిర్యాదుతో ఏసుబాబుపై కేసునమోదుచేసినట్లుఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారులో మంటలు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డు సమీపంలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై వెళుతున్న కారులో మంటలు చెలరేగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కారు భద్రాచలం నుంచి ఖమ్మం వెళుతుండగా జూలూరుపాడుకు రాగానే పొగతోపాటు మంటలు వ్యాపించాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కిందకు దిగగా పెను ప్రమాదం తప్పింది. స్థానికులు నేరేళ్లకుంట ప్రసాద్ దంపతులు, విద్యుత్ లైన్‌మెన్ నల్లగట్ల భాస్కర్ రావు, సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కారు హెడ్‌లైట్ వైర్ షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు.

బెదిరింపుల కేసులో ఇద్దరికి జైలుశిక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఒక వ్యక్తిని బెదిరించి నగదు డిమాండ్ చేసిన కేసులో ఇద్దరికి భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ బుధవారం జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన పీతాని సుబ్బారావు.. తాను ఇల్లు నిర్మిస్తుండగా ముద్ద పిచ్చయ్య, మండల రవికుమార్ నగదు ఇవ్వాలని బెదిరించారంటూ 2019లో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయగా ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మామిడి రైతు విలవిల

- చీడపీడలు, కోతుల బెడదకు తోడు గాలి దుమారాలు
- చేతికందే దశలో పంట నేలపాలు


నేలరాలిన మామిడి కాయలు

చంద్రుగొండ / అన్నపురెడ్డిపల్లి: మామిడి రైతులు విల్లవిల్లాడుతున్నారు. చీడపీడలు దాటుకుని అరకొరగా చేతికందే దశలో ఉన్న పంట గాలిదుమారాలు, వడగండ్ల వర్షాలతో నేలపాలవుతోంది. చంద్రుగొండ, అన్నపురెడ్డిపలి మండలాల్లో ఒకప్పుడు కళకళలాడిన మామిడితోటలు నేడు వెలవెలబోతున్నాయి. ఉమ్మడి చంద్రుగొండ మండలంలో పదేళ్ల క్రితం వరకు ఐదు వేల ఎకరాల్లో మామిడితోటలు ఉండగా ప్రస్తుతం రెండు వేల ఎకరాలకే పరిమితమైంది. దిగుబడి తగ్గడం, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల వస్తున్న గాలిదుమారాలు, వర్షం, వడగండ్లతో ఒక్క అన్నపురెడ్డిపల్లి మండలంలోనే 400 ఎకరాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

పంటనష్టంపై నివేదిక ఇచ్చాం



పంటనష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. గత 15 రోజులుగా వస్తున్న గాలిదుమారాలతో అన్నపురెడ్డిపల్లి మండలంలో 400 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది.

– సందీప్, ఉద్యాన విస్తరణాధికారి

తీరని నష్టం వచ్చింది



గాలిదుమారాలు, వర్షంతో మామిడి కాయలు నేలరాలి తీవ్రంగా నష్టపోయాం. దిగుబడి బాగుంటే ఆదాయం వస్తుందనే ఆశతో భారీగా పెట్టుబడి పెట్టాం. ఇప్పుడు పెట్టుబడితో పాటు కష్టం కూడా వర్షార్పణం అయింది.

– నరుకుళ్ల వాసు, అయన్నపాలెం, చంద్రుగొండ మండలం

ఐదెకరాల్లో పంట నష్టం



గాలిదుమారాలతో ఐదెకరాల్లో మామిడి పంట నష్టపోయా. కోతదశకు చేరుకున్న తరుణంలో గాలిదుమారం రావడంతో కాయలు నేలరాలాయి. ప్రభుత్వం మాకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజాపురం, అన్నపురెడ్డిపల్లి మండలం

భానుడి భగభగ..


నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలిలా..

భద్రాచలం	43.1
సీతారాంపట్నం	43.0
లక్ష్మీదేవిపల్లి	43.0
అశ్వాపురం	43.0
కరకగూడెం	42.9
గరిమెళ్లపాడు	42.7
పాతకొత్తగూడెం	42.7
యానంబైలు	42.7
సుజాతనగర్	42.7
మణుగూరు	41.7
దుమ్ముగూడెం	41.6
గుండాల	41.5
ములకలపల్లి	41.2
మద్దుకూరు	41.1

చుంచుపల్లి: భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం నుంచే ఉగ్రరూపం దాల్చుతుండగా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో బుధవారం 43.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరిబోండాలు, చెరకు రసం, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కాగా, బుధవారం సూర్య ప్రతాపం పెరగడంతో జన సంచారం ఎక్కువగా లేక రోడ్లన్నీ బోసిబోయాయి.

అత్యవసరమైతేనే బయటకు రండి..

భద్రాచలంటౌన్: సూర్యప్రతాపం నానాటికీ పెరుగుతోందని, మధ్యాహ్నం సమయంలో ప్రజలు అత్యవసమైతేనే బయటకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. భద్రాచలంలో బుధవారం అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. రాబోయే 10 రోజులు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రేపటి నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఐదో మహాసభలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మం సుందరయ్య భవనంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2002 తర్వాత ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు జరుగుతుండగా, తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మహాసభల్లో 33 జిల్లాలు, పదహారు యూనివర్సిటీల నుంచి 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. తొలిరోజైన శుక్రవారం ఉదయం వేలాది మందితో ర్యాలీ నిర్వహించాక భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్షుడు వీ.పీ.సాను, సినీ నటుడు మాదాల రవి, ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి పాల్గొంటారన్నారు. విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాగరాజు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, టి.ప్రవీణ్, నాయకులు దొంతబోయిన వెంకటేష్, వినోద్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, జీవన్ పాల్గొన్నారు.